ఆర్టీసీ కాంప్లెక్స్, రైతు బజార్‌లు ప్రారంభమయ్యేనా...!

సీపీఐ జిల్లా కార్యదర్శి మరిపిల్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసి ఏళ్ళు గడుస్తున్నాయని, రైతు బజార్ నిర్మాణం పూర్తయిందని.. వీటిని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. సీపీఐ భీమిలి ఏరియా పార్టీ సమావేశం తగరపువలస జీఆర్ భవన్‌లో మోర అప్పలరాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్నదని వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లేకపోవడం వలన తగరపువలసలో ప్రజలు బస్సుల కోసం ఎండలో నిలబడవలసి వస్తుందని, త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకుడు అల్లు బాబురావు, ఏరియా కార్యదర్శి కె.రాంబాబు, ఏఐటీయూసీ కార్యదర్శి కె.ఈశ్వరరావు, సీహెచ్ రాంపైడి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి సైన్స్ ప్రదర్శన ప్రారంభం

విశాలాంధ్ర - పీఎం పాలెం: కొమ్మాది సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల వేదికగా ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి సైన్స్ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఈ సందర్భంగా తిలకించి అభినందించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పరిధిలోని ఉమ్మడి జిల్లాల్లోని పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులు రూపొందించారు. జల వనరుల నిర్వహణ, పార్కింగ్ సమస్యలకు పరిష్కారం, సోలార్ విద్యుత్ వినియోగం, గృహ నిర్మాణాలు, వ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రదర్శలు ఇచ్చారు. వాటి గురించి క్షుణ్ణంగా వివరించారు. భవిష్యత్తులో వాటి ఉపయోగాలను తెలుపుతూ రూపొందించిన ప్రాజెక్టుల రూపకల్పనపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. ఇలాంటి వేదికలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్, కొమ్మాది, ఇతర గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోర్ట్‌లో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ)లో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. పోర్ట్ చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి, ఐఓఎఫ్ఎస్, పోర్ట్ విభాగాధిపతులు, అధికా రులు, సిబ్బంది సమక్షంలో పరిపాలనా భవనంలో ఇంటిగ్రిటీ ప్రతిజ్ఞను చదివించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి సందేశాలు ఉన్నతాధికారులు చదివి వినిపించారు. అనంతరం పోర్ట్ సిబ్బంది సీ హార్స్ జంక్షన్ వరకూ ర్యాలీని నిర్వహించారు. వారం రోజుల పాటు జరగనున్న కార్యక్రమంలో భాగంగా వీపీఏ సిబ్బంది, వారి పిల్లల కోసం వక్తృత్వం, క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించడంతోపాటు పోర్ట్ భాగస్వాములతో ప్రత్యేకంగా సమావేశాలను నిర్వహించనున్నారు. పోటీలలో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందించనున్నారు. పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్ మీడియాకు ఈ సమాచారాన్ని తెలియజేశారు.

బాణసంచా దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింత వాసు నాయుడు అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, మండలంలో 10 మంది బాణాసంచా అమ్మకాలకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. బోయపాలెంలో 4, ఆనందపురంలో 6గురు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఆనందపురంలో బీపీ కల్లాలు రోడ్డు శుభశ్రీ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఖాళీ స్థలంలో బాణాసంచా విక్రయాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. బోయపాలెం బ్రిడ్జి సమీపంలో జన సమూహం లేనిచోట అమ్మకాలు సాగించాలన్నారు. సామగ్రి భద్రపరిచిన గొడౌన్లు, దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఇసుక, ఫైర్ ఇంజిన్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. ఒక్కో దుకాణానికి 5 నుంచి 10 అడుగుల దూరం పాటించాలని, పరిమితికి మించి మందుగుండు సామాగ్రిని నిల్వ ఉంచకూడదని పేర్కొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ వహించాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికగా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు మరింత శ్రద్ధ వహించాలని, సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఒకసారి నమోదైన ఫిర్యాదు మళ్లీ ఓపెన్ కావడానికి వీలు లేదని, అలా జరిగితే ఫిర్యాదుదారులతో నేనే స్వయంగా కల్పించుకొని మాట్లాడతానని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. అవసరమైతే జిల్లా అధికారులు ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడాలని, నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గత వారం వచ్చిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకే అంశంపై మళ్లీ మళ్లీ ఫిర్యాదులు రావడానికి వీలు లేదని సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ రోజు వచ్చిన వినతుల్లో 26 ఫిర్యాదులు అత్యవసరంగా పరిష్కరించాల్సినవి ఉన్నాయని ఆయా శాఖల అధికారులు 29వ తేదీ సాయంత్రంలోగా వాటిని పరిష్కరించి నివేదించాలని సూచించారు. గత వారం వచ్చిన వాటిలో 27 ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎప్పటి కప్పుడు ఆయా శాఖల పరిధిలో వచ్చిన వినతులపై ఆడిట్ నిర్వహించుకోవాలని చెప్పారు.

వివిధ సమస్యలపై పీజీఆర్ఎస్‌కు 237 వినతులు

సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 237 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 54, జీవీఎంసీకి చెందినవి 61, పోలీసు శాఖకు సంబంధించి 19, ఇతర శాఖలకు సంబంధించి 103 ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి. శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు హాజరయ్యారు.

సామాజిక చైతన్యం ద్వారానే సైబర్ నేరాల అదుపు

వాట్ సదస్సులో విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాలాంధ్ర - మధురవాడ: సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ళ చేతికి చేరుతోందని, సామాజిక చైతన్యం ద్వారానే ఈ తరహా సైబర్ నేరాలను అదుపు చేయడం సాధ్యపడుతుందని విశాఖ పార్లమెంట్ సభ్యుడు, గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వ విద్యా లయం మహిళ సాధికారిక విభాగం, టెక్‌మాంత్రిక్ ఐటి సంస్థ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన ఉమెన్ అండ్ టెక్నాలజి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ నేరపూరిత స్వభావం, మనుషుల మధ్య నమ్మకం సన్నగిల్లి ప్రతి ఒక్కరిని అనుమానంగా చూడటం పెరుగుతోందన్నారు. మహిళలు మానసికంగా

ధృడంగా ఉన్నప్పుడే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. సాంకేతికంగా విద్యావంతులైన మహిళలు సైబర్ నేరాల పట్ల అవగాహన, పెంచడంతోపాటు నేరస్తులపై చట్ట ప్రకారం శిక్షలు పడే వరకు సామాజిక కార్యకర్తలుగా తమ వంతు కృషి చేయాలన్నారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రాతబాగ్చి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటిలో అధిక శాతం సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు చెందినవిగా గుర్తించామన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కీలకమైన సమాచారాన్ని ముఖ్యంగా పాస్ వర్డ్‌లు, చిత్రాలు వంటివి ఎవరితోను పంచు కోవద్దని సూచిం చారు. సింబయాసిస్ అధినేత ఓ.నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఇం టర్‌నెట్ యూజర్ల వ్యక్తిగత సమాచార గోప్యతను పాటించాలని, ఎలాంటి వివరాలు సామాజిక మాధ్యమాల పంచుకోవాలో తెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో హిందూ దిన పత్రిక రెసిడెంట్ ఎడిటర్ సుమిత్ భట్టాచార్య, గీతం ఇఇసిఇ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.రాజేష్ కుమార్, టెక్ మాంత్రిక్ సీఈఓ సూర్య, గీతం మహిళా సాధికారిక విభాగం అధ్యక్షురాలు డాక్టర్ వి.బి.శ్రీవిద్య, ఐద్వా మహిళా సంస్థ కార్యద్శి రమాదేవి, జీమ్‌సర్ సైకాలజి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వి.నివేధిత, గీతం న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.చిత్ర సక్సేన, పాలసి ఎనలిస్ట్ ఓషిన్ పి.సహరే, ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజి అసోసి యేషన్ అధ్యక్షురాలు ఎమ్.లక్ష్మి, ఎమ్.జె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - భీమిలి: అనుమతులు లేకుండా మందుగుండు సామాగ్రిని కలిగి ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భీమునిపట్నం పోలీసులు తెలిపారు. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం భీమునిపట్నం మండలం, దాకమర్రి గ్రామానికి చెందిన దాసరి వెంకన్న తక్కువ ధరకు మందుగుండు సామాగ్రి కొని ఎక్కువ ధరకు అమ్ముతుంటారనే సమాచారం మేరకు భీమిలి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ గౌరి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్ళారు. అక్కడ రూ.2,500 విలువ చేసే జువ్వలు, కమ్మరేకు బాంబులు తదితర మందుగుండు సామాగ్రి ఉండడంతో అనుమ తులు లేకుండా మందుగుండు సామాగ్రి అమ్మడం నేరమని దాసరి వెంకన్నను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఏఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

వీధి దీపాల సమస్య పరిష్కరించండి

జెడ్సీకి సీపీఐ నేతల వినతి

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడలో వీధి దీపాల సమస్య పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిషనర్‌కు మధురవాడ ఏరియా సీపీఐ కార్యదర్శి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎనిమిదో వార్డ్ పాత మధురవాడ ఏరియా ప్రాంతంలో వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, చంద్రంపాలెం ఏరియా సిపిఐ పార్టీ కరపత్రాలు పంచడానికి వెళ్లినప్పుడు చంద్రంపాలెం వస్తువులు లైట్లు వెలగట్లేదని చెప్పారన్నారు. రాత్రిపూట పాములు తిరుగుతున్నాయని, దొంగతనాలు జరుగుతున్నాయని, చంద్రంపాలెం ఏరియాలో కూడా ఆరు నెలల నుంచి ఆ లైట్ వెలగట్లేదని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు ఎంఏ బేగం, పాత మధురవాడ ఏరియా నాయకులు కె.అరుణ్ కుమార్, పి.రమణ, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా బజారును సందర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి కోర మండల్ మున్సిపల్ ఆఫీస్ వద్ద అర్బన్ మార్కెట్ డ్వాక్రా గ్రూప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్వాక్రా బజారును సోమవారం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వస్తువులను తిలకించి వాటి నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 61వ వార్డు అధ్యక్షులు మజ్జి సోమేష్, సెక్రటరీ జయశంకర్, వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీ లక్ష్మీ, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వీనుల విందుగా ఆర్జిత సేవలు



విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. సోమవారం ఆలయ వైదిక సిబ్బంది ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆలయ కార్య నిర్వహణాధికారి ఆనంద్ కుమార్, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు పర్యవేక్షణలో స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధీష్టింపజేసి వేద మంత్రాలు, నాథ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి నిత్య కళ్యాణం, గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు. స్వామి వారిని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు తదితరలు దర్శించుకున్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో 75వ వార్డు టీడీపీ కార్యాలయంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వం చురుకుగా జరుగుతుంది. ఈ సందర్భంగా పులి లక్ష్మీబాయి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు 5 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, శ్రీముసిరి శ్రీనివాసరావు, పెద్దాడ సోము నాయుడు, గోక్యాడ ముత్యాలు, ములకలపల్లి పెంటయ్య, ఊరుకుటి అప్పల రాజు, పులి శ్రీరామ రెడ్డి, పులి చిన పెంటయ్య రెడ్డి సూరిబాబు, డొమ్మేటి సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర - ఆనందపురం: గిడిజాలలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీఓ జానకి సందర్శించారు. సీఈఓ నారాయణమూర్తి ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం పథకం పూర్తిస్థాయిలో అందుతున్నది లేనిది నాణ్యత పరిశీలించి, అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకురావాలని,

పలుచోట్లకు మార్చడం వల్ల పూర్తిస్థాయి ప్రయోజనం ఇంకా చేకూరాలని తెలిపారు. అలాగే సచివాలయం సందర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కార్యదర్శి ధనుంజయ, స్థానిక నాయకులు కోరాడ వైకుంతరావు, సర్పంచ్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందికి ప్రత్యామ్నాయం చూపాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు

విశాలాంధ్ర - విశాఖ: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 5 ఏళ్ళు సూపర్వైజర్లు, సేల్స్ మేనేజర్లుగా పనిచేసిన వారికి కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.ఎస్.జె. అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. అల్లిపురం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సుమారు 15వేల మంది సూపర్ వైజర్, సేల్స్ మేనేజర్, వాచ్ మెన్‌లు ప్రభుత్వం మద్యం దుకాణంలో పనిచేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నూతన మద్యం పాలసీ ద్వారా వీరందరినీ తొలగించడం అన్యాయమని అన్నారు. కూటమి ప్రభుత్వం వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించకుండా.. వారిని, వారి కుటుంబాలను రోడ్డున పడేసారని అన్నారు. ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెబుతు న్నారు తప్ప ఇప్పటికే 2 లక్షల 60 వేల మంది వాలంటీర్లు ఉపాధి కోల్పోయారని, ఇప్పుడు వీరు కూడా రోడ్డున పడ్డారని అన్నారు. ఉన్న ఉద్యోగాల్ని కూటమి ప్రభుత్వం ఊడగొడుతోందని, ఏపీ స్టేట్ బెవరేజేస్ ఎండిఓ వీరందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాయ మాటలు చెప్పి నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. వీరెవరూ వైసీపీ పార్టీకి సంబంధించిన వారు కాదని తెలిపారు. వీరిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మన్మధరావు, సంఘం అధ్యక్షులు మోహనరావు, హరినాధరావు, గణేష్ మహదేవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక:

ఈ సమావేశంలో ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ (ఏఐటీయూసీ) యూనియన్ విశాఖ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.మోహన్‌రావు, కార్యదర్శిగా బి.హరి నాధరావు, ఆర్గనైజర్ సెక్రటరీగా కెంగువ అచ్యుతరావు, ఉపాధ్యక్షులుగా పి.గణేష్, సహాయ కార్యదర్శిగా జి.సురేష్, కోశాధికారిగా జె.మహదేవ్, కమిటీ మెంబర్లుగా వి.రాము, డి.రామ్ సురేష్, పి.దుర్గారావు, కె.గణేష్, ఎం.శ్రీనులు ఎన్నికయ్యారు.

క్రీడల్లో రామవరం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. స్కూల్ మోనిటరింగ్ కమిటీ భీమిలి, అనకాపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు మొత్తం 9 మంది విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ యర్ర పైడిరాజు, ఎస్ఎంసి చైర్మన్ రామచంద్ర రాజు పాఠశాలను సందర్శించి ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. పాఠశాల హెచ్ఎం నాగ మణి, పిడి కే.నారాయణ మూర్తి, పలువురిని అభినందించారు.

ఐలా నుండి రూ.2,79,28,000 పన్ను వసూళ్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీలో ఆస్తి పన్ను వసూళ్లు గాజువాక జోన్ పరిశ్రమల నుండి చేయడంతో అభివృద్ధి పనులకు ఎంతగానో దోహద పడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్న పన్నులు వసూలు చేసిన రెవెన్యూ అధికారులను ఈ సందర్భంగా కమిషనర్ అభినందించారు. గాజువాక జోన్ జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు ఏపీఐఐసీ ఐలా నుండి 60వ వార్డులో రూ.2,68, 39,111 పన్ను వసూళ్లు చేయగా, జోన్‌లో మరికొన్ని ప్రాంతాల నుండి రూ.10, 65 వేలు చేశారు. మొత్తం రూ.2 కోట్ల 79 లక్షల 28 వేలు వసూలు చేసిన చెక్కులను జోనల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రికి ఆర్వోలు రామానారాయణ, శ్రీకాంత్, ఆర్ఐలు సుబాన్, రెడ్డి మోహన్, కొట్టాడా శివ తదితరులు అందజేశారు.

హెచ్ఆర్ఏను తక్షణమే పునరుద్ధరించండి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: నిలిపివేసిన హెచ్ఆర్ఏను ఉక్కు ఉద్యోగులకు తక్షణమే చెల్లించాలని, ఉక్కు టౌన్ షిప్‌లో నివాసముంటున్న ఉద్యోగులకు పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ఎక్స్ గ్రేషియాను చెల్లించాలని ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నాను సోమవారం నిర్వహించారు. మహా ధర్నా నుద్దేశించి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్‌లు డి. ఆది నారాయణ, మంత్రి రాజ శేఖర్, సి.హెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఉక్కు యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఏకపక్షంగా సుమారు 7 వేల మంది ఉక్కు ఉద్యోగులకు హెచ్ఆర్ఏను నిలిపివేయడం దారుణం అని అన్నారు. ఉక్కు టౌన్ షిప్‌లో నివాస ముంటున్న సుమారు 5 వేల మందికి విద్యుత్ చార్జీలు భారీగా పెంచిందని అన్నారు. దసరా పండుగకు ఇవ్వాలిన ఎక్స్‌గ్రేషియాను ఇవ్వలేదని కార్మిక సంఘాల నాయకులు మండి పడ్డారు. కార్మిక ప్రయోజనాలను అమలు చేయని యాజమాన్యం విఆర్ఎస్ పేరుతో కార్మికులను తగ్గించాలని చూడడం సరైంది కాదన్నారు. తక్షణమే ఉక్కు యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావు అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నాలో కార్మిక సంఘాల నాయకులు జె.రామకృష్ణ, మసెన్ రావు, నరేష్ కుమార్, కె.రాజ బాబు, జె.అయోధ్య రామ్, యూ.రామ స్వామి, ఎన్.రామారావు, నీరుకొండ రామ చంద్రరావు, పి.వి రమణమూర్తి, విల్లా రామ్మోహన్ కుమార్, గణపతి రెడ్డి, దొమ్మేటి అప్పారావు, డేవిడ్ , మహాలక్ష్మి నాయుడు, వరసాల శ్రీనివాసరావు, సి.హెచ్ సన్యాసిరావు, దాసరి సురేష్ బాబు, కె.పరంధామయ్య, రాంకుమార్, ఎస్.మోహన్ బాబు, జి.ఆనంద్, ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ

విశాలాంధ్ర - పెందుర్తి: జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల సొమ్ము కాజేసిన కాంట్రాక్టర్లపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. పెందుర్తి ఆసుపత్రిలో సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం పడాల గోవింద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని అడిగితే పరిష్కారం చేయకుండా అధికారులు ఎందుకు చిన్న చూపు చూస్తున్నారని ప్రశ్నించారు. కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ పే స్లిప్పులు ఇవ్వాలని, జిల్లాలో వివిధ ఆసుపత్రులలో పడకలకు తగ్గ సిబ్బందిలేక పోవడంతో అదనపు పని భారం పడి కార్మికులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తక్షణమే సిబ్బందిని నియ మించాలన్నారు. కార్మికులు సమస్యలు పరిష్కారం చేయకుంటే ఛలో విజయవాడ, హైకోర్టు దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్, సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ, నాయకులు భవాని, నమ్మి లక్ష్మి, జాన్సీ, దేవి,కుమార్, ఉమాదేవి, రామ లక్ష్మి, గణేష్, పైడమ్మ, లక్ష్మి, పద్మ, కుమారి,జిల్లాలో వివిధ ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఆరు అర్జీలు వచ్చినట్లు భీమిలి జోనల్ కమీషనర్ ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి -2, ఇంజనీరింగ్ విభాగానికి -4 వచ్చినట్లు చెప్పారు. తదుపరి చర్యలకు సంబందిత శాఖాధిపతులకు పంపినట్లు ఆమె తెలిపారు.

కేవీలో సోపాన్ టెస్టింగ్ క్యాంప్ ఆఫ్ స్కౌట్ / గైడ్స్

విశాలాంధ్ర - మల్కాపురం: నౌసేనాబాగ్ కేవీలో తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ ఆఫ్ స్కౌట్ / గైడ్స్ ముగిశాయని ప్రధానోపాధ్యాయులు సుధీర్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం తూర్పు నౌకాదళ కమాండ్‌కు చెందిన సీనియర్ విద్యాశాఖాధికారి కమాండర్ సురుచి గౌర్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వేదిక ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్ మైంగి అధ్యక్షత వహించారు. సర్ బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నౌసేనాబాగ్‌లోని గైడ్ విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ముఖ్య వక్తగా హాజరైన సురుచి 3 రోజుల శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు ప్రత్యేక అతిథిని అభినందించారు. అక్కడ ప్రదర్శించిన వివిధ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు మార్గదర్శకులను ఆమె అభినందించారు. కలలను కాపాడుకోవడానికి, కష్టపడి పనిచేయడానికి, వారి కలలను సాధించడానికి నిరంతరం ప్రయత్నించడానికి ఆమె గైడ్‌ను ప్రేరేపించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - విశాఖ : స్థితప్రజ్ఞ ఫౌండేషన్, ఆర్య వైశ్య యువజన సంఘం ఆదివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని వాసవి భవన్‌లో నవంబర్ 14న చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాస రచన, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ నగర పరిధిలోని 30 స్కూల్స్ నుంచి వెయ్యి మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవివి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీంతో పాటుగా నవంబర్ 3న క్విజ్, వక్తృత్వ పోటీలు, నవంబర్ 9న ఫైర్ లెస్ కుకింగ్, చెస్, సింగింగ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీలు ముగిసిన తరువాత విజేతలకు ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థితప్రజ్ఞ ట్రస్టీ ప్రదీప, ఇతర సభ్యులు కే రామకృష్ణ, ఎన్ శివప్రసాద్, వెంకటేష్, షీలా, ప్రశాంతి, దుర్గ బాబు, భాస్కర్, ప్రవీణ్, సాయి, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్‌షిప్‌లో 31 మంది విజేతలు



విశాలాంధ్ర - ఆనందపురం: శ్రీ గంటా కనకారావు మెమోరియల్ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ విభాగంలో విశాఖ భీమిలీ వింగ్స్ షోటోకన్ కరాటే ఛాంపియన్షిప్ అకాడమీలో నిర్వహించిన 5 పాఠశాలకు చెందిన 31 మంది విద్యార్థులు వివిధ రకాలు భాగాల్లో మెడల్స్ సాధించారు. చీఫ్ కోచ్ టి.సాయికుమార్ ఆధ్వర్యంలోఎస్సార్ స్కూల్ -8, నవజీవన్ స్కూల్ -20, భాష్యం స్కూల్-1, విశాఖ వ్యాలీ స్కూల్-1, సృజన స్కూల్-1, మంది విద్యార్థులు అందులో గోల్డ్-7 ,సిల్వర్-11, బ్రాంచ్ మెడల్స్-13, మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర- విశాఖపట్నం: దీపావళి పండుగ సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ పీఆర్కే ప్రసాద్ తెలిపారు. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. చిన్న పిల్లలను టపాసులతో ఒంటరిగా వదిలి పెట్టకూడదన్నారు. సింథటిక్ కంటే కాటన్ దుస్తులు ఉత్తమమన్నారు. కాటన్ దుస్తులు మంటలు అంటుకోకుండా ఉంటాయన్నారు. దీపావళి సమయంలో ఎక్కువగా వేసుకునే సంప్రదాయ దుస్తులు వల్ల మంటలు అంటుకునే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. దీపాలు వెలిగించడానికి, టపాసులు కాల్చడానికి బహిరంగ ప్రదేశాలు ఎంచుకోవాలన్నారు. కాల్చిన టపాసులు నీటిలో ముంచి పారవేయాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కాలిన గాయానికి ప్రథమ చికిత్స అవసరమన్నారు.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదును వేగవంతం చేయాలని ఎంఈఓ రవీంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాలల్లో సుమారు 353 మంది ఉపాధ్యాయులు ఉన్నారని జూనియర్ కళాశాలలో 16 మంది, 56 ప్రైవేట్ పాఠశాలలు 511 మంది ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కును నమోదు చేయడానికి అర్హులుగా ఉన్నారన్నారు. వీరు ఆన్లైన్ ద్వారా గాని ఆఫ్లైన్ ద్వారా గాని నమోదు చేసుకోవాలని ఆఫ్లైన్ ద్వారా తాసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందించాలన్నారు. నవంబరు 6వ తేదీ లోపు ఓటు నమోదు చేసు కోవాలన్నారు. ముందుగా నమోదు చేసుకున్నట్లయితే ఎటువంటి అభ్యంతరాలు ఉన్న తెలియపరచడానికి అవకాశం ఉంటుందని చివరి దశలో వచ్చిన వారికి పలు ఇబ్బందులు అవకాశం ఉన్నందున ఓటు హక్కును వేగవంతం చేసుకోవాలని తెలిపారు.

వ్యవసాయ శాఖ ఏఈఓల సమస్యలు పరిష్కరించాలి

ముఖ్య కార్యదర్శికి వినతి పత్రం అందజేసిన నేతలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లా పరిషత్‌లో జరిగిన సమావేశానికి విచ్చేసిన వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ ఢిల్లీ రావు ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులకు తమ యొక్క సభ్యులతో కలిసి సమస్యల కొరకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రేషనలైజేషన్ పేరుతో ఏఈఓలను క్లస్టర్ స్థాయి నుంచి గ్రామ స్థాయిలో ఉన్న వి.ఏ.ఏ వీ.హెచ్.ఏలతో సమానంగా పనిచేయమనడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 సంవత్సరాలుగా సర్వీసు చేస్తున్న ఏఈఓలకు ప్రమోషన్ లేకపోగా ఈ విధంగా గ్రామ స్థాయిలో పనిచేయమనడం పట్ల తీవ్రమైన అభ్యంతరం తెలియజేయడం జరిగింది. ఈ మా కేడర్‌కు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రెసిడెంట్ యమ్.నాగరాజు, కార్యదర్శి వి.కూర్మారావు, మూడు జిల్లాల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండి ఉచిత గ్యాస్ బుకింగ్

విశాలాంధ్ర - ఆనందపురం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పథకాల్లో భాగంగా దీపావళి సందర్భంగా అమల్లోకి రానున్న ఉచిత గ్యాస్ కొందరికేనని తెలుస్తోంది. ప్రభుత్వం జిల్లాలోని తెల్లకార్డు దారులు అందరికీ ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుందని చెబుతోంది. లోగుట్టును గమనిస్తే ఆధార్ నెంబర్ పరిశీలన మెలిక పెట్టింది. ఆధార్ డేటా ఆధారంగా వార్షిక ఆదాయాన్ని పరిశీలించిన అనంతరం పలువురికి కోత విధించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయనే వాదనైతే బలంగా వినిపిస్తోంది. ఆధార్ కార్డు పరిశీలనను నిబంధనల్లో చేర్చినట్లు తెలుస్తోంది. క్రిమీలేయర్ తరహా నిబంధనలను అమలు చేసి లబ్దిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 29 నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్ సదుపాయాన్ని కల్పించింది. అర్హులైన లబ్దిదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేసిన 24 గంటల నుంచి 48 గంటలలోపు గ్యాస్ నగదును ఖాతాల్లో జమ చేయనుంది. అక్టోబర్ 31 నుంచి మార్చి నెలాఖరు లోపు మొదటి సిలిండర్, ఏప్రిల్ ఒకటి నుంచి జూన్ నెలాఖరు నాటికి రెండవ సిలిండర్, జులై నుంచి సెప్టెంబర్ నెలాఖరు నాటికి మూడవ సిలిండర్‌ను సరఫరా చేసే అవకాశాలను పరిశీలిస్తోంది.

పనాజీ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల బృందం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహావిశాఖపట్నం నగరపాలక సంస్థ కార్పొరేటర్ల బృందం సోమవారం గోవాలో పనాజీ మున్సిపల్ కార్పొరేషన్ ను సందర్శించారని జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ గోవా నుండి సోమవారం తెలిపారు. కార్పొరేటర్ బృందం పనాజీ మున్సిపల్ కార్పొరేషన్ యందు ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, ప్రైమరీ కలెక్షన్ వద్ద పొడి -తడి చెత్త విభజించుట నేరుగా ఆర్ ఆర్ ఆర్ సెంటర్లకు పంపుట , ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ ద్వారా వచ్చిన గ్యాస్ ను హెూటల్స్ కు,సామూహిక గృహాలకి నేరుగా వంట గ్యాస్ కొరకు సరఫరా చేయుట, మిగిలిన చెత్తని నేరుగా ల్యాండ్ ఫిల్లింగ్ నకు ఉపయోగించుట , పనాజీ నగరాన్ని రహిత నగరంగా తీర్చిదిద్దుట తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనాజి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వివరించారని కార్యదర్శి తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం పనాజీ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ క్లీన్ మధిర ను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు సన్మానించడం జరిగిందని కార్యదర్శి తెలిపారు.

అనంత పద్మనాభుని పవిత్రోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో జరిగే లోపాల నివారణ పరిహారం కోసం ప్రతి ఏడాది పవిత్రో త్సవాలను చేపడుతారు. ఇందులో భాగంగా తొలి రోజు విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, మృత్యు గ్రహం, రక్షాబంధనం తదితర కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. అనంతరం కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా సంత బయలు వద్దకు తీసుకుని వెళ్లి అంకురార్పణ చేశారు. అక్కడ మేదిని దేవతకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మృత్తిక ను సేకరించి ఆ మృత్తికను ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాంజనేయ ఆధ్వర్యంలో ఆలయానికి తీసుకొని వచ్చారు. దేవాలయం, గ్రామం, పాడి పంటలు, పశు సంపద సుభిక్షంగా ఉండడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కే రాంబాబు, టిడిపి పార్టీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కే నగేష్ కుమార్, సామాజిక సేవకులు రూపాకుల రవికుమార్, బిజెపి నాయకులు మహేష్, ఆలయ కమిటీ సభ్యులు టీ పైడిరాజు, సన్యాసిరావు, సన్నీ బాబు, రాము, కోటి, ఆలయ అర్చకులు పవన్ కుమార్, వెంకటాచార్యులు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

134 పరుగుల అధిక్యంలో హిమాచల్ ప్రదేశ్

విశాలాంధ్ర - పీఎం పాలెం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ రంజీ ట్రోఫీ మ్యాచ్ విశాఖపట్నం పీఎం పాలెంలోని ఏసీఏ - వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మూడో రోజు హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ సోమవారం ప్రారంభమైంది. తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ మూడో రోజు మ్యాచ్ సమయం ముగిసేసరికి 150 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 478 పరుగులు చేసి 134 పరుగులు

అధిక్యంలో ఉంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ క్రీడాకారులు ఆకాష్ వి వశిష్ట్ 85 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. జట్టు కెప్టెన్ రిషి ఆర్ ధావన్ గ్రౌండ్లో బ్యాట్ తో చెలరేగిపోయాడు. 318 బంతుల్లో 19 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 195 పరుగులు చేసి డబల్ సెంచరీకి చేరువలో నిలిచారు. ముకుల్ నేగి 42 పరుగులు చేసి అర్థ సెంచరీకి చేరువలో అవుట్ అయ్యాడు. బౌలింగ్ బరిలో దిగిన ఆంధ్ర జట్టు బౌలర్ కె.వి. శశికాంత్ తన అద్భుతమైన బౌలింగ్ తో హిమాచల్ ప్రదేశ్ పరుగులకు బ్రేకులు వేసి నాలుగు వికెట్లను కైవసం చేసుకున్నాడు. పి.సత్యనారాయణరాజు కూడా అద్భుతంగా రాణించి మూడు వికెట్లను కైవసం చేసుకున్నాడు. టి. విజయ్, జి.మనీష్‌లు తలొక వికెట్ ను సొంతం చేసుకున్నారు.

మందుబాబులకు జరిమాన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 10 మందికి జరిమానా విధిస్తూ భీమిలి మెట్రోపాలిటన్ జడ్జి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. అనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి పట్టుబడిన 10 మందిపై కేసు నమోదు చేసి భీమిలి కోర్టుకు తరలించగా భీమిలి 15 అదనపు మెజిస్ట్రేట్ డి. సౌజన్య ఒక్కక్కరికి పదివేల రూపాయలు చొప్పున 10 మందికి ఒక లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు ఈ సందర్భంగా ఎస్సై పాపారావు మాట్లాడుతూ. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

వైసీపీ ప్రారంభంలో ఉన్నవారు ఇప్పుడు ఎందుకు లేరు....

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రభుత్వానికి వచ్చిన వెంటనే ప్రజలకు దూరంగా ఉండి, అధికారం కోల్పోయాక ప్రజలపై దొంగ సానుభూతులు చూపిస్తున్న జగన్ మీడియా ముందుకు రావటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన సీతంపేట లోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢీ అంటే ఢీ లా సిద్ధంగా ఉండలని చెప్పటం హాస్యాస్పదం ఉందన్నారు. రెడ్ బుక్ దెబ్బ అంటూ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పాలన మొదలుకాగానే విశాఖలో భూములు స్వాధీనం, ఇల్లు కూల్చివేతలు చేసిన గొప్ప పాలనను ప్రజలు మర్చిపోరు అన్నారు. జగన్ శవ రాజకీయాలకు పాల్పడుతున్నారు అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అద్భుతంగా పాలిస్తుందన్నారు. ఎన్నికల ఇచ్చిన మేనిఫెస్టోను పవిత్ర గ్రంధాలు అని చెప్పి ప్రజలను మోసం చేసిన జగన్ ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాను పెంచి పోషించిన వైసిపి ప్రభుత్వం అన్నారు. మరో నాయకుడు ఎదుగుదల అంగీకరించకుండా ఒంటరి పోకడతో పాలించిన గత ముఖ్యమంత్రి అని విమర్శించారు. వైన్ షాప్‌లో దోపిడీతో అక్రమంగా నెలకు 3 కోట్లు వసూలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు. దోపిడికి మరో పేరుగా పాలించిన వైసిపికి నేడు నీతులు వల్లించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. లక్షలు కోట్లు స్కాం ఇసుక, మైనింగ్ శాఖ లో చేశారు. నేడు ఉచిత ఇసుకపై మాటలాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎంవీవీ అవినీతి పరుడు, దుర్మార్గుడు అని తెలిపారు. అక్రమంగా నిర్మాణాలు చేయటం ఎంవీవీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వైసిపి హయాంలో ఎక్సైజ్ శాఖ నిర్వీర్యం అయ్యేలా ప్రభుత్వం మద్యం షాపులు ఏర్పాటు చేశారని, కూటమి వచ్చాక ఎక్సైజ్ శాఖ పునరుద్ధరణ చేశారన్నారు. మిధున రెడ్డి మూడు కోట్లు వంతున ముడుపులు వసూలు చేశారన్నారు. అట్ట పెట్టలులో కూడా కుంభకోణం చేశారని, మైన్స్ రెండు కోట్లు వసూలు చేశారని, రాజ్ రెడ్డి ద్వారా మిథున్ రెడ్డి లీలలు బయటకు వస్తాయన్నారు. ఈ కుంభకోణాలు మీద విచారణ చేయాలి అని సిఎంను కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - భీమిలి: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం భీమిలి జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులు పనిచేయటంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొం టున్నారని, ముఖ్యంగా పనిముట్లు కూడా ఇవ్వకపోవడం, సంవత్సర కాలం నుండి మరణించిన పదవీ విరమణ చేసిన కార్మికుల స్థానంలో కార్మికుల కుటుంబం సభ్యులకు ఉద్యోగం ఇవ్వలేదని, కార్మికుల సంఖ్య తగ్గి పని బారం పెరుగుతుందని దీనితో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, చాలా మంది పారిశుద్ధ్య కార్మికులు అనారోగ్యం తో పని చేస్తున్నారని వీరి స్థానంలో వీరి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇస్తే చాలా మంది యువత వస్తారని అన్నారు. పారిశుద్ధ్యం మెరుగు పడుతుందని ఈ కార్మికులకు వెంటనే సేఫ్టీకి సంబంధించిన సబ్బులు, నూనెలు, రైన్ కోట్లు ఇవ్వాలని కోరారు. గతంలో సమ్మె చేసిన 16 రోజుల సమ్మె ఒప్పందంలో భాగంగా జీవో 25 ప్రకారం లక్ష డెత్ ఎక్స్‌గ్రెసియా ఇవ్వడం లో జాప్యం లేకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయవాడ వరద సహాయక చర్యలలో పాల్గొన్న కార్మికులకు రెండు జతల బట్టలు కుట్టించుకునే కూలి చార్జీలు వెంటనే చెల్లించాలని, 2018 నుండి 2020 మధ్యలో 2% కటింగ్ చేసిన ఎస్ ఎల్ ఎఫ్‌లో ఉన్న మొత్తాన్ని కార్మికుల అకౌంటలలో జమ చేయాలని, విలీన పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని జోనల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవ్వ నర్సింగరావు పాల్గొన్నారు.

విశాఖ పర్యాటక అభివృద్ధితో ఉజ్వల భవితపై జెఎల్‌ఎల్ నివేదిక

విశాలాంధ్ర - విశాఖపట్నం: విశాఖపట్నం భారతదేశంలోని ఆంధ్ర ప్రదేశ్‌లో ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది, ఇక్కడ జరిగిన సి ఐ ఐ టూరిజం ట్రావెల్ సమ్మిట్ 2024లో విడుదల చేసిన నివేదిక ప్రకారం 'విశాఖపట్నం యొక్క పర్యాటక రంగాన్ని అన్‌లాకింగ్ చేయడం: వ్యూహాలు మరియు అవకాశాలు' అనే విషయంలో జె ఎల్ ఎల్ ఇలా వివరిస్తుంది. తూర్పు తీరప్రాంతం వెంబడి ఉన్న నగరం యొక్క వ్యూహాత్మక ప్రదేశం, బీచ్‌ల నుండి చారిత్రక ప్రదేశాల వరకు దాని విభిన్న ఆకర్షణలతో కలిపి, ఇది గణనీయమైన పర్యాటక అభివృద్ధికి బాగా ఉపయోగపడుతుంది. 2023లో, ఆంధ్రప్రదేశ్ మొత్తం పర్యాటక ప్రవాహానికి విశాఖపట్నం ప్రాంతం సుమారు 24% (దాదాపు 61 మిలియన్ల మంది పర్యాటకులు) అందించింది. ఈ ప్రాంతం రామకృష్ణ బీచ్, రుషికొండ వంటి బీచ్‌లు, బౌద్ధ సముదాయాలు వంటి చారిత్రక ప్రదేశాలు, అరకు లోయ మరియు బొర్రా గుహలు వంటి సహజ అద్భుతాలు మరియు సింహాచలం ఆలయం వంటి మతపరమైన కేంద్రాలతో సహా అనేక ఆకర్షణలను అందిస్తుంది.

"విశాఖపట్నం భారతదేశ పర్యాటక రంగంలో పవర్‌హౌస్‌గా మారడానికి సిద్ధంగా ఉంది. దాని సహజమైన బీచ్‌లు మరియు పర్యావరణ-పర్యాటక హాట్‌స్పాట్‌ల నుండి గొప్ప సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల వరకు విభిన్నమైన ఆఫర్‌లతో, ఈ ప్రాంతం సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

తాగునీటి సరఫరాలో నిత్యం నాణ్యతా పరీక్షలు నిర్వహించండి

జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ నగర ప్రజలకు నిత్యం సరఫరా చేస్తున్న తాగునీటిలో కలుషితం లేకుండా నిత్యం నాణ్యతా పరీక్షలు అన్ని నీటి పంప్ హౌస్‌లలో నిర్వహించాలని, శుద్ధిచేసిన తాగునీటిని ప్రజలకు అందించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివ ప్రసాద్ రాజు, నేటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కెవిఎన్ రవితో కలిసి బర్మా కాలనీ లోగల బ్లాక్ 18 నీటి సరఫరా పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ పరిశీలనలో బర్మా కాలనీ పంప్ హౌస్ వద్ద సరఫరా జరుగుతున్న నీటి నాణ్యతను పరిశీలించారు. ఈ పంప్ హౌస్ ద్వారా సరఫరా జరుగుచున్న తాగునీటిలో రోజుకు ఎన్ని శాంపిల్స్ పరీక్షిస్తున్నారని కమిషనర్ ఆరా తీయగా పర్యవేక్షక ఇంజనీర్ స్పందిస్తూ బర్మా కాలనీ బ్లాక్ 18 పంప్ హౌస్ 2270 కిలోలీటర్ల సంపు కలిగి ఉన్నదని, 18,182 నీటి సర్వీస్ కనెక్షన్ల ద్వారా ఈ ప్రాంతంలో ఒక లక్ష మంది ప్రజలకు తాగునీటిని మధ్యాహ్నం రెండు గంటల నుండి ఆరు గంటల వరకు సరఫరా చేయడం జరుగుచున్నదని, రోజుకి 18 నీటి శాంపిల్స్ను పరీక్షిం చడం జరుగుతుందని కమిషనర్‌కు వివరించారు. అనంతరం సమీపంలోనున్న ఒక ఇంటి వద్ద వ్యక్తిగత నీటి కొళాయిలో వస్తున్న నీటిని కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఆ పరీక్షలో నీటి నాణ్యత 2 పిపిఎం ఈసీ 320గా నమోదయిందని రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ సీనియర్ ఎనలిస్ట్ శివరామకృష్ణ కమిషనర్ కు వివరిస్తూ సరఫరా జరుగుతున్న నీరు నాణ్యత కలిగి ఉన్నదని ఎటువంటి కలుషితం లేదని కమిషనర్‌కు తెలిపారు. ఒక నిరంతర ప్రక్రియగా జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ప్రజలకు అందించవలసిన నీటి సరఫరాలో ప్రత్యేక జాగ్రత్తలు చేపడుతుందని, అలాగే వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు కలిగిన నివాసితులు ఇంటిలో అంతర్గత పైప్ లైన్ కనెక్షన్లలో గల నీటిని కలుషితం కాకుండా, అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యపరమైన రక్షణ చర్యలు, జాగ్రత్తలు చేపడుతూ జీవీఎంసీ కి సహకరించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ, బిఎస్ కెమికల్స్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో ఆక్రమణదారులు చొరబాటు

నిబంధనలు భేఖాతరు
సర్కారు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మార్వో శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో అక్రమాలు స్వాధీనపరుచుకొని ప్రహరీ గోడ ఏర్పాటు చేసి, సర్కారు స్థలంలో రెవెన్యూ బోర్డులు పెట్టినప్పటికీ ఆక్రమదారులు నిబంధనలు బేకాతరు చేస్తూ రెచ్చిపోతున్నారు. అనందపురం సర్వే నంబరు 276లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇతర శాఖలకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల కొంతమంది ఆక్రమణకు పాల్పడడంతో రెవెన్యూ అధికారులు ఆక్రమ స్థలాలను స్వాధీన పరుచుకొని కొంతమేర ప్రహరీ ఏర్పాటు చేశారు . అక్రమ దారులు నిబంధనలను తుంగలో తొక్కి మరల కబ్జా చేసేందుకు పొగా వేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మాటలను

పట్టించుకోకుండా రోజుకో విధంగా స్థలంలోకి చొరబడి యుదేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. విషయం తెలుసుకున్న మండల తాసిల్దార్ పేర్ల. శ్యామ్ ప్రసాద్, ఆర్ఐ ఉమాదేవి ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని మరల సోమవారం సాయంత్రం పరిశీలన చేసి సర్కారు స్థలంలో ఎటువంటి పనులు చేపట్టరాదని , పరిసర ప్రాంతాలు ఎక్కడ ఉండకూడదనన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సందర్భంగా హెచ్చరించారు.

వచ్చే నెలలో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సిద్ధం

విశాలాంధ్ర - విశాఖ : వి ఎం ఆర్ డి ఏ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టు వచ్చేనెల అక్కడికి పూర్తవుతుందని మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. సోమవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ 87.50 కోట్ల రూపాయలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు వల్ల సిరిపురం ప్రాంతంలో పార్కింగ్ సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. మూడు బేస్ మెంట్ ఫ్లోర్లు, ఒకటి, రెండు ఫ్లోర్లను పార్కింగ్ కోసం వినియోగిస్తారు.1.90 లక్షల చదరపు అడుగులు పార్కింగ్ కోసం అందుబాటులోకి వస్తుంది. 430 ఫోర్ వీలర్లు, 400 ద్విచక్ర వాహనాలు పర్కింగ్ చేసుకునేందుకు వీలుంటుంది. గ్రౌండ్ ఫ్లోర్ ని మిగతా 5 ఫ్లోర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తారు. ఈ ఆరు ఫ్లోర్లలో 1.64 లక్షల ఎస్ ఎఫ్ టి స్పేస్ అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం గ్లాస్ తో ఎలివేషన్ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంగణంలోకి అద్దెకు వచ్చేందుకు ఐటీ కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఎన్ఏడి ఫ్లై ఓవర్ వద్ద ఆర్ఓబి ని వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ పనులు పూర్తయితే ఎన్ఏడి జంక్షన్ వద్ద మరో లైన్ అందుబాటులోకి వస్తుంది. ఎంఐ జి స్మార్ట్ టౌన్ షిప్ లకు సంబంధించి రఘుమండ, జియన్న వలస, గరివిడిల్లో తొలి దశ పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. రెండో దశలో యూజీడి, ఎలక్ట్రిఫికేషన్ పనుల కోసం టెండర్లు పిలిచినట్టు తెలిపారు ఈ మూడు ఎంఐజి లే అవుట్లలో ప్లాట్లు దాదాపుగా విక్రయించారు. అడ్డూరులో 21 ఎకరాల్లో ఎంఐజి లేఅవుట్ ప్రతిపాదించారు. దాకమర్రి లేఔట్ లో పెద్ద సంఖ్యలో ప్లాట్లు అమ్ముడుపోని కారణంగా ధరపై పునః సమీక్ష చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. త్వరలో వీ ఏం ఆర్ డి ఏ బోర్డు సమావేశం ఏర్పాటు చేయనట్టు చెప్పారు. ప్లానింగ్ విభాగంలో డిప్యూటేషన్ పై సిబ్బందిని తీసుకున్నట్టు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కనెక్టివిటీ రోడ్లపై దృష్టి సారించామన్నారు. జిల్లా సమీక్ష సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చిందని తెలిపారు. వి ఎం ఆర్ డి ఏ లో గతంలో ఫైళ్లను డిజిటలైజేషన్ చేశారని తెలిపారు. వీఎంఆర్డీఏ ఆర్థిక స్థితిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వీఎంఆర్డీఏ పరిధిలో జల వనరుల అభివృద్ధిపై దృష్టి పెట్టామని తెలిపారు.